
సాక్షి
వనపర్తి

గురువారం ı 10 ı జూలై ı 2025



### స్వల్పంగా తగ్గిన వరద

జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద బుధవారం స్వల్పంగా తగ్గింది.

వివరాలు 8లో ▸



### అర్హులకు దక్కేనా..?

జడ్చర్లలో రెండు పడక గదుల ఇళ్ల కోసం లబ్ధిదారులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు.

వివరాలు 8లో ▸

### వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.2 /22.5

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### బైరోజు, పోల్కంపల్లికి రాష్ట్రస్థాయి పురస్కారాలు



బైరోజు చంద్రశేఖర్



పోల్కంపల్లి శాంతాదేవి

వనపర్తి టౌన్: సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ బుధవారం ప్రకటించిన రాష్ట్రస్థాయి పురస్కారాలకు పట్టణానికి చెందిన ప్రముఖ నవల రచయిత్రి పోల్కంపల్లి శాంతాదేవి, శిల్పి విభాగంలో ప్రముఖ శిల్పి, సాహితీవేత్త, వ్యాఖ్యాత బైరోజు చంద్రశేఖర్ ఎంపికయ్యారు. ఈ నెల 19న ఒక్కొక్కరికి రూ.20,116 నగదు, పురస్కారాలు అందజేయనున్నారు. ఈ సందర్భంగా సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, సాహితీవేత్తలు వెంకటేశ్వర్‌రెడ్డి, నారాయణరెడ్డి, జనజ్వాల, సూర చంద్రశేఖర్, గోపీనాథ్, గంధం నాగరాజు, శ్యాంసుందర్, బండారు శ్రీనివాస్, రాములు హర్షం వ్యక్తం చేశారు.

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచండి



అమరచింత: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని జిల్లా గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ విఠోభా కోరారు. బుధవారం పుర కార్యాలయంలో కమిషనర్ నాగరాజుతో కలిసి వార్డు అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టణానికి 55 ఇళ్లు మంజూరయ్యాయని, ప్రొసీడింగ్ పత్రాలు అందుకున్న లబ్ధిదారుల్లో ఇప్పటి వరకు 18 మంది ఇళ్ల మార్కింగ్ చేసుకొని పనులు ప్రారంభించారని వార్డు అధికారులు వెల్లడించారు. మిగిలిన లబ్ధిదారులు కూడా పనులు త్వరగా ప్రారంభించేలా చూడాలని పీడీ కోరారు. పుర మేనేజర్ యూసూఫ్ తదితరులు పాల్గొన్నారు.

### తండాల్లోని సమస్యలు పరిష్కరించాలి

పాన్‌గల్: జిల్లాలోని పలు గిరిజన తండాల్లో నెలకొన్న సమస్యలను జిల్లా అధికారులు పరిష్కరించాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్యానాయక్ కోరారు. బుధవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండా, మల్లాయిపల్లితండాలో పర్యటించి ఆయా తండావాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తండాల్లో గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, మూతబడుతున్న పాఠశాలలను తెరిపించాలన్నారు. అర్హులకు గిరిజన కార్పొరేషన్ రుణాలు ఇవ్వాలని.. తండాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. గతంలో పలుమార్లు జిల్లా అధికారులకు సమస్యల వినతిపత్రాలు అందజేసినా స్పందన లేదని.. పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే గిరిజనులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాబునాయక్, రవినాయక్, చిట్టెమ్మ, కిషన్, సక్రూ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



# వరద భయం..!

## పెద్ద వాగుపై 50 ఏళ్ల కిందట కత్వ నిర్మాణం



ఇతడి పేరు కప్పెట చెన్నయ్య. మండలంలోని మల్కిమియాన్‌పల్లి స్వగ్రామం. గతేడాది పెద్ద వాగు పొంగిపొర్లి కత్వకు గండి పడి పక్కన ఉన్న 0.30 ఎకరాల వ్యవసాయ భూమి కోతకు గురైంది. ఇసుక మేటలు వేయడం చూసి కన్నీటి పర్యంతమయ్యారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు పరిశీలించి రూ.15 వేలు పరిహారం అందించి చేతులు దులుపుకొన్నారు. ఈ వర్షాకాలంలో వాగు పారితే మరింత భూమి కోతకు గురయ్యే ప్రమాదముందని భయాందోళనకు గురవుతున్నారు.



మల్కిమియాన్‌పల్లి శివారులో మరమ్మతుకు నోచుకోని కత్వ

- గతేడాది వరదలకు గండి
- కోతకు గురైన పంట పొలాలు
- నేటికీ మరమ్మతులు కరువు.. ఆందోళనలో అన్నదాతలు
- పాటు కాల్వకు నిలిచిపోనున్న పెద్ద వాగు, కేఎల్‌ఐ నీరు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రం సమీపంలోని గణపసముద్రం రిజర్వాయర్(కాకతీయుల కాలంలో తవ్విన చెరువు)కు వర్షపు నీటిని మళ్లించేందుకు 50 ఏళ్ల కిందట పెద్దవాగుపై కత్వ (ఆనకట్ట) నిర్మాణం చేపట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని లట్టుపల్లి, భీమునితండా తదితర ప్రాంతాలు, మండలంలోని మామిడిమాడ, పర్వతాపురం, అప్పారెడ్డిపల్లి, మల్కిమియాన్‌పల్లి, అన్‌పహాడ్, వెంకటాంపల్లి, కమాలోద్దీన్‌పూర్, ఆగారం, అంతాయపల్లి, కొత్తపల్లి మీదుగా వచ్చే వర్షపు నీరు పెద్దవాగుకు చేరి కృష్ణానదిలో కలుస్తుంది. ఈ వాగుకు అడ్డంగా మల్కిమియాన్‌పల్లి, అప్పారెడ్డిపల్లి, అన్‌పహాడ్ శివారులో కత్వ నిర్మించారు. వాగు పారే సమయంలో గణపసముద్రం రిజర్వాయర్‌కు నీటిని మళ్లించేలా షట్టర్లను బిగించారు. ఏటా వాగు పారే సమయంలో అవసరమైన నీటిని మళ్లించి తర్వాత షట్టర్లను మూసి వేస్తారు. మిగతా నీరంతా కత్వ నిండి పైనుంచి పారేలా ఏర్పాట్లు చేశారు.

### మరమ్మతులు కరువు..



గతేడాది కత్వను ఎవరో ఓ పక్క కొంచెం పగలగొట్టారు. పెద్దవాగు పారడంతో మా పొలాల పక్కన తెగింది. దీంతో 0.15 ఎకరాల భూమి కోతకు గురైంది. కత్వ మరమ్మతులు ప్రారంభించి అర్థాంతరంగా నిలిపివేశారు.

– బుగ్గని కర్రెన్న, మల్కిమియాన్‌పల్లి

### కత్వ నిర్మాణం చేపట్టాలి..



ప్రభుత్వం కొత్తగా కత్వ నిర్మాణం చేపట్టాలి. లేకపోతే ఈ ఏడాది వర్షాలకు పెద్ద వాగు పారి పొలాలు మొత్తం కొట్టుకపోతాయి. గతేడాది 0.20 ఎకరాల భూమి కొట్టుకపోయింది. ఈ ఏడాది వాగు పారితే వందల ఎకరాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. కత్వ మరమ్మతు చేపడితేనే గణప సముద్రం రిజర్వాయర్‌కు నీరు చేరుతుంది.

– చిట్యాల చెన్నయ్య, మల్కిమియాన్‌పల్లి

### ప్రభుత్వానికి నివేదించాం..

ఖిల్లాఘనపురం మండలం మల్కిమియాన్‌పల్లి, అప్పారెడ్డిపల్లి, అన్‌పహాడ్ శివారులో గణపసముద్రం రిజర్వాయర్‌కు నీటిని మళ్లించేందుకు వాగుకు అడ్డంగా నిర్మించిన కత్వ గతేడాది వరదకు గండి పడింది. మరమ్మతు కోసం అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించాం. మంజూరు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– మధుసూదన్‌రావు, ఈఈ, నీటిపారుదలశాఖ

### కోతకు గురైన భూములు..

గణప సముద్రం చెరువును రిజర్వాయర్‌గా మారుస్తూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభం కావడంతో కొందరు వ్యక్తులు కత్వకు ఓ పక్కన ఉన్న కొంత సిమెంట్ బెడ్డు, రాతి కట్టడాన్ని తొలగించారు. గతేడాది పెద్ద వాగుకు భారీగా వరద రావడంతో సగభాగం తెగి పలువురు రైతుల పొలాలు కోతకు గురయ్యాయి. దెబ్బతిన్న భూములకు పరిహారం ఇవ్వాలని, ఈ ఏడాది వర్షాకాలంలో వాగు పారితే వందల ఎకరాల భూములు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని.. వెంటనే మరమ్మతులు చేపట్టాలంటూ రైతులు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డితో పాటు తహసీల్దార్, వ్యవసాయ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.



గణపసముద్రం రిజర్వాయర్‌కు నీటిని మళ్లించే పాటు కాల్వ

కత్వ నిర్మాణం పూర్తయితేనే కేఎల్‌ఐ నీరు గణపసముద్రం రిజర్వాయర్‌కు చేరుతాయి.

## మానవ మనుగడలో వృక్షాలే కీలకం



మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి.. చిత్రంలో ఇన్‌చార్జి కలెక్టర్ విజయేందిర బోయి

వనపర్తి: ప్రాణ వాయువునిస్తూ మానవ మనుగడలో వృక్షాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని.. వాతావరణ సమతుల్యత కాపాడుతున్న చెట్లను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవంలో భాగంగా బుధవారం జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఏకో పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్లు జి.వెంకటేశ్వర్లు, యాదయ్య, డీఎఫ్‌ఓ సత్యనారాయణతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతకు భూ భాగంలో 33 శాతం అటవీ ప్రాంతం ఉండాలని, ప్రస్తుతం జిల్లాలో 18 నుంచి 19 శాతం మాత్రమే ఉందని, పచ్చదనం పెంపొందించేందుకు ప్రజలందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇళ్ల ఆవరణలు, పొలాల గట్లు, ఖాళీ స్థలాల్లో విరివిగా మొక్కలు నాటి సంరక్షించేలా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులు తీసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు నిర్వహిస్తున్న వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది 21 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఆర్డీఓ సుబ్రమణ్యం, జిల్లా అధికారులు, విద్యార్థులు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**బైపాస్ రోడ్‌లో మార్నింగ్ వాక్..**

జిల్లాకేంద్రంలోని కొత్తకోట రోడ్ నుంచి కర్నూలు రోడ్ వరకు బుధవారం ఉదయం ఎమ్మెల్యే మార్నింగ్ వాక్ చేపట్టారు. ప్రజలకు ఉపయోగపడేలా బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి జిల్లాకేంద్రంలోని మెడికల్, నర్సింగ్ కాలేజీ, కోర్టులు, ఇతర కార్యాలయాలకు చేరుకునేందుకు సౌకర్యంగా మారనుందని తెలిపారు. రోడ్డు నిర్మాణంలో స్థలాలు కోల్పోయే వారితో మాట్లాడి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, నాయకులు కిచ్చారెడ్డి, మహేష్, కృష్ణ, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## రేపు మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్



ఎస్.వెంకటేశ్వర్లు

వనపర్తిటౌన్: వనపర్తి పుర పరిధిలోని సమస్యలు పరిష్కరించడంలో భాగంగా 'సాక్షి' ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 వరకు పుర కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లుతో ఫోన్–ఇన్ కార్యక్రమం నిర్వహించనున్నాం. పుర ప్రజలు తమ తమ వార్డుల్లో సీసీ రహదారులు, డ్రైనేజీల నిర్మాణం, పారిశుద్ధ్యం, ఇంటింటి చెత్త సేకరణ, రహదారుల శుభ్రత, తాగునీటి సరఫరాలో అంతరాయం, వీధిదీపాల ఏర్పాటు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చు.

**ఫోన్ చేయాల్సిన నంబర్లు 98499 05923, 90102 37295**

తేదీ : 11.07.2025 (శుక్రవారం) సమయం : ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 వరకు

## లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షకు ఏర్పాట్లు

**రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు**



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు.. ఇతర అధికారులు

వనపర్తి: లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్ష ఈ 27న నిర్వహించనున్నందున తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం పరీక్షల నిర్వహణపై సీసీఎల్‌ఏ లోకేష్‌కుమార్ హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా నుంచి అదనపు కలెక్టర్ హాజరై వివరాలు వెల్లడించారు. 15వ తేదీలోగా పరీక్ష కేంద్రం వివరాలు సిద్ధం చేసి సీసీఎల్‌ఏకు పంపనున్నట్లు చెప్పారు. జిల్లాలో మొదటి విడత శిక్షణకు 112 మందిని కేటాయించారని.. 27న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాత పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. సమావేశంలో ఏడీ ల్యాండ్ సర్వేయర్ బాలకృష్ణ, ఏఓ భానుప్రకాష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



ఎస్పీ రావుల గిరిధర్‌కు పూల మొక్క అందజేస్తున్న శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సైలు

వనపర్తి: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వర్తించాలని, నూతన చట్టాలపై అవగాహన కల్పించాలని, పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. జిల్లా పరిధిలో శిక్షణ పొంది మొదటిసారి పోలీస్‌స్టేషన్లలో బాధ్యతలు తీసుకున్న ఆరుగురు ఎస్‌ఐలు హిమబిందు, దివ్యారెడ్డి, జె.నరేష్, ఎస్.వేణుగోపాల్, డి.శశిధర్, కె.భాస్కర్ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. క్రమశిక్షణ, అంకితభావం, నిజాయితీగా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేయాలని సూచించారు. మొదటి పోస్టింగ్‌ను ఎప్పుడూ మరిచిపోమని.. నిర్వర్తించిన విధులు జీవితాంతం గుర్తుండిపోతాయని తెలిపారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని, ఏదైనా ఘటన జరిగితే వెంటనే అక్కడికి చేరుకోవాలని, డయల్ 100 ఫిర్యాదులను స్పందించాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాల రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచాలని చెప్పారు. నేను సైతం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలను గ్రామస్తులు, వ్యాపారులతో కలిసి మరమ్మతు చేయించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, డీసీఆర్బీ డీఎస్పీ ఉమామహేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్ పాల్గొన్నారు.

## మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న నాబార్డ్ డీడీఎం మనోహర్‌రెడ్డి

కొత్తకోట రూరల్: జిల్లాలోని మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని నాబార్డ్ డీడీఎం పి.మనోహర్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని కనిమెట్టలో ఎస్‌బీఆర్డీ ఎన్జీఓ కొత్తకోట ఆధ్వర్యంలో నిర్వహించిన మత్స్య రైతు ఉత్పత్తిదారుల సంఘ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎఫ్‌ఈఓ నిర్వహణకు నాబార్డ్ నిధులు రూ.27 లక్షలు మంజూరుకాగా, సభ్యుల పొదుపు, వాటాధనం ఆధారంగా రూ.15 లక్షలు ఈక్విటీ గ్రాండ్ మంజూరు చేస్తోందన్నారు. ఎఫ్‌ఈఓ లెక్కలు క్రమం తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. సభ్యులు సంఘటితంగా ఉండి వాటా ధనం చెల్లిస్తే నాబార్డ్ ప్రతి సభ్యుడికి రూ.2 వేలు అందజేస్తుందని తెలిపారు. ఎఫ్‌ఈఓ ద్వారా చేపల ఆధారిత వ్యాపారం అభివృద్ధి చేసుకునేందుకు బ్యాంకుతో అనుసంధానం చేయనున్నట్లు చెప్పారు. ముదిరాజ్ కమ్యూనిటీలో చేపల ఆధారితంగా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే సభ్యులకు లాభాలు వస్తాయో జిల్లా మత్స్యశాఖ అధికారి డా. బి.లక్ష్మప్ప వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబంలో ఆదాయం పెరుగుతుందని.. కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానం, క్షేత్ర సందర్శన యాత్రలు చేపట్టి వ్యాపార కేంద్రాలను చూపిస్తామని, శిక్షణ కూడా ఇస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకుమార్, వాకిటి బాలరాజు, గాదం పరమేశ్, పెంటయ్య, నరుకుల బాలన్న, నరుకుల శ్రీనివాసులు, మత్స్య సహకార సంఘం అధ్యక్షురాలు ఆకుల ఇందిరమ్మ, 11 మంది డైరెక్టర్లు, కురుమయ్య, పి.శ్రీనివాసులు సీఈఓ పి.అరుణ, ఎస్‌బీఆర్డీ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం




జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

వనపర్తి రూరల్: పెట్టుబడిదారుల కోసం కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు పుట్టా ఆంజనేయులు ఆరోపించారు. బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా జిల్లాకేంద్రంలో చేపట్టిన కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, టీయూసీఐ, బీఆర్‌టీయూ, టీఎస్జీయూసీ, ఐసీఈయూ తదితర సంఘాల నాయకులు, కార్మికులు, పలు శాఖల ఉద్యోగులు, రైతులు పాల్గొని మద్దతు తెలిపారు. పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల నుంచి గాంధీచౌక్ ,శంకర్‌గంజ్, కమాన్ చౌరస్తా మీదుగా జూనియర్ కళాశాల మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ జరిగిన సమావేశంలో టీయూసీఐ జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోషా, బీఆర్‌టీయూ జిల్లా నాయకుడు గట్టు యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని, సంఘం ఏర్పాటు చేసుకొనే హక్కు కష్టతరంగా మార్చిందన్నారు. 1886లో సాధించుకున్న 8 గంటల పనిదినాన్ని రద్దు చేసి 12 గంటలు పని చేయాలని నిర్ణయించిందని.. రాష్ట్ర ప్రభుత్వం జీఓనంబర్ 282 తీసుకొచ్చి పది గంటలు పని చేయాలని నిర్ణయించడం దారుణమని తెలిపారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించడం పక్కన పెట్టిందని, వేతనాలకు గ్యారెంటీ లేకుండా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు, స్కీం వర్కర్లు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. హమాలీ, రవాణా తదితర రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు.

### దరఖాస్తుల ఆహ్వానం

పాన్‌గల్: ఓపెన్ విధానంలో పది, ఇంటర్ పూర్తి చేసేందుకు ప్రవేశాలు ప్రారంభమయ్యాయని.. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని కేతేపల్లి ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కారణాలతో చదువు మధ్యలో మానేసిన వారు తిరిగి కొనసాగించేందుకు ఓపెన్ స్కూల్ ద్వారా అవకాశం కల్పిస్తుందని.. ఈ నెల 11 వరకు దరఖాస్తుకు గడువు ఉన్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 85558 87342 సంప్రదించాలని సూచించారు.

### వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయండి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజని

వనపర్తి రూరల్: రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు దుకాణదారుడితో విధిగా రసీదు తీసుకొని పంట దిగుబడి సరిగా రానప్పుడు వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజని సూచించారు. బుధవారం మండలంలోని ఖాసీంనగర్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు, బాల కార్మికుల చట్టం గురించి వివరించారు. అదేవిధంగా ఉచిత న్యాయ సాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించాలని తెలిపారు. అనంతరం గ్రామంలో ఉచిత న్యాయ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. న్యాయపరమైన సహాయం, సలహాల కోసం కమిటీలో ఉన్న ప్యానల్ లాయర్లు తిరుపతయ్య, ఎండీ నిరంజన్‌బాబా, పారా లీగల్ వలంటీర్లు శివప్రసాద్, రవీందర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డా. పుష్పలత, ప్యానల్ లాయర్లు తిరుపతయ్య, కృష్ణయ్య, ఎండీ నిరంజన్‌బాబా, వలంటీర్లు రవీందర్, శివప్రసాద్, నాగరాజు, కార్యదర్శి లక్ష్మి, మాజీ సర్పంచ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన ఘటన చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్సై వెంకటేశ్ కథనం మేరకు.. బీహార్‌లోని పాట్నా జిల్లా లోదిపూర్‌కు చెందిన సోనెలాల్ సింగ్ (25) నాలుగు నెలల క్రితం గద్వాల మండలంలోని అనంతాపురం సమీపంలో గల ఓ రైస్ మిల్లులో కూలీ పనినిమిత్తం వచ్చి మిత్రులతో కలిసి ఉంటున్నాడు. మంగళవారం స్వగ్రామానికి వెళ్తానని తోటి మిత్రులకు చెప్పి ఎర్రవల్లి కూడలికి వచ్చాడు. ఈ క్రమంలో రాత్రి పుల్లారెడ్డి పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారిని దాటుతుండగా గుర్తు తెలియని వాహన ఢీకొట్టడంతో తీవ్ర రక్త గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అంబులెన్స్‌లో గద్వాల మార్చురీకి తరలించారు. మృతుడి మిత్రుడు సుభాష్ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

### కారు బోల్తా: వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి: మండలంలోని వావిళ్లబావి గ్రామం వద్ద బుధవారం కారు బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతిచెందగా.. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం దేవరకద్ర మండలానికి చెందిన దుబ్బల శ్రీధర్, భూత్పూర్‌కు చెందిన హర్షవర్ధన్‌రెడ్డి, తుమ్మల రాఘవేందర్, దుబ్బల హరిప్రసాద్ కారులో దేవరకద్ర నుంచి సోమశిలకు బయలుదేరారు. మార్గమధ్యలో మండలంలోని వావిళ్లబావి గ్రామం వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. కారులో ఉన్న నలుగురికి తీవ్రగాయాలు కాగా వారిని 108 అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. దుబ్బల శ్రీధర్(23) పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమాధ్యలో మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### మహిళపై వేధింపులు: వ్యక్తిపై కేసు నమోదు


నవాబుపేట: మహిళను వేధించిన ఘటనలో వ్యక్తిపై కేసు నమోదు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నవాబుపేట మండల కేంద్రానికి చెందిన వివాహిత జిల్లా కేంద్రంలో కూలీ పనికి వెళ్తున్న తరుణంలో టీడీ గుట్ట అడ్డాలో ఉన్న మేస్త్రీ సురేందర్ ఆమెపై లైంగిక వేధింపులకు దిగాడు. దీంతో మహిళ కూలికి వెళ్లటం మానేసింది. కాగా సురేందర్ బుధవారం మండల కేంద్రానికి వచ్చి సదరు వివాహిత ఇంట్లో ఒంటరిగా ఉండగా ఆమెను చంపుతానంటూ భయభ్రాంతులకు గురిచేసి బలవంతంగా కారులో ఎక్కించుకుని జిల్లా కేంద్రం వైపు తీసుకెళ్లాడు. దీంతో ఆమె కేకలు వేయటంతో.. మండల కేంద్రం నుంచి యన్మన్‌గండ్ల సమీపంలో ఆమెను వదిలేసి పరారయ్యాడు. అనంతరం బాధితురాలు తన భర్త మైబుతో కలిసి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మేస్త్రీ సురేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

### అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


యాదయ్య(ఫైల్)

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేటలో బుధవారం అదే గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ పొలంలో అనుమానాస్పదంగా మృతిచెందాడు. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన సల్ల పెద్దయాదయ్య(50) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం ఇంటి వద్ద టిఫిన్ చేసి అచ్యుతారెడ్డి వ్యవసాయ పొలంలో కూలీ పనులకు వెళ్లాడు. అక్కడ కరెంటు మోటారు సమీపంలో పొలం పనులు చేస్తూ మృతిచెందాడు. సాయంత్రం పొలానికి సమీపంలో గొర్రెలను మేపుతున్న కాపరి పొలంలో యాదయ్య మృతి చెంది ఉండడాన్ని గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశాడు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. యాదయ్య కాలుకు కరెంట్ షాక్ తగిలినట్లు బొబ్బలు ఉండడంతో కరెంట్ షాక్‌తోనే మృతి చెంది ఉంటాడని తెలిపారు. కరెంటు మోటారు సమీపంలోని తీగలు తగిలి మృతిచెందినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ శివారెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. మృతుడికి భార్య పెద్ద వెంకటమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. యాదయ్య కరెంటు షాక్‌తో మృతి చెందినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు.

### ఉల్లిధర గరిష్టంగా రూ.2 వేలు



దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లి ధరలు నిలకడగా ఉన్నాయి. గత వారం వచ్చిన ధరలే ఈ వారం నమోదయ్యాయి. సీజన్ తగ్గడంతో మార్కెట్‌కు వచ్చిన వేయి బస్తాల ఉల్లిని కొనడానికి వ్యాపారులు పోటీ పడ్డారు. క్వింటాల్ ఉల్లి గరిష్టంగా రూ.2 వేలు పలుకగా కనిష్టంగా రూ.1400 ధర వచ్చింది. 50 కేజీల ఉల్లి బస్తాను గరిష్ట ధర రూ.1000, కనిష్ట ధర రూ.700 వరకు విక్రయించారు. ఎక్కువగా చిరు వ్యాపారులు, వినియోగదారులు ఉల్లిని కొనుగోలు చేశారు.

# అర్హులకు దక్కేనా..?


బోయలకుంటలో అసంపూర్తిగా నిలిచిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

**డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ఎదురుచూపులు**

- జడ్చర్ల నియోజకవర్గంలో దాదాపు 2వేల ఇంటి నిర్మాణాలు పూర్తి
- నేటికీ కేటాయించని వైనం
- ఎర్రగుట్టలో మాత్రం యథేచ్ఛగా ఇళ్ల ఆక్రమణ

జడ్చర్ల: డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. కనీస మౌళిక వసతుల కల్పనతో అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేస్తామని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు జడ్చర్ల నియోజకవర్గంలో ఎక్కడా పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించలేదు. అసలు డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ఇప్పటి వరకు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారో కూడా స్పష్టత లేదు. దీంతో లబ్ధిదారుల ఎంపికలో అయోమయం చోటు చేసుకుంది.

**2,700 ఇళ్లు మంజూరు**

జడ్చర్ల నియోజకవర్గంలో దశల వారీగా ఇప్పటివరకు 2,700 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరయ్యాయి. ఎక్కువగా జడ్చర్ల మండలంలోనే 2132 ఇళ్లు నిర్మించారు. అయితే కావేరమ్మపేట, బండమీదిపల్లి, కోడ్గల్, తదితర గ్రామాల్లో మినహాయిస్తే ఎక్కడా డబుల్ బెడ్‌రూం ఇండ్లు లబ్ధిదారులకు ఇవ్వలేదు. మిడ్జిల్, బాలానగర్, నవాబ్‌పేట, రాజాపూర్ మండలాల్లో సైతం డబుల్ బెడ్‌రూం ఇళ్లు పెండింగ్‌లో ఉన్నాయి.

**దరఖాస్తుల వెల్లువ**

డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరుకు సంబంధించి దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఒక్క జడ్చర్ల పట్టణంలోనే దాదాపు 3వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. కానీ డిమాండ్‌కు సరిపడా గత ప్రభుత్వం ఇళ్లు నిర్మించలేకపోయింది. పూర్తయిన ఇళ్లను సైతం అర్హులకు అందించలేదు. తాజాగా అర్హులను గుర్తించి ఇళ్లను కేటాయించడంలో అధికారులు ఎంతమేరకు పారదర్శకతను పాటిస్తారో వేచి చూడాల్సి ఉంది.

**ఐదేళ్లుగా అసంపూర్తిగానే..**



బోయలకుంట కాలనీలో నిర్మిస్తున్న ఇళ్ల పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయి. నిర్మాణపనులు చేపట్టి దాదాపు ఐదేళ్లయినా ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో నిర్మించలేదు. వెంటనే పనులు పూర్తి చేసి తమకు ఇళ్లు కేటాయించాలి.

– యాదయ్య, దరఖాస్తుదారుడు, బోయలకుంట

**త్వరలో అర్హులను ఎంపిక చేస్తాం**



ఎర్రగుట్టలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించుకున్నారు. వీరిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి అర్హులైన వారిని ఎంపిక చేయాల్సి ఉంది. తమ దగ్గర ఉన్న దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారిని త్వరలోనే గుర్తించేలా చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మీనారాయణ, తహసీల్దార్, జడ్చర్ల

**తాజాగా తెరపైకి..**

ఎర్రగుట్ట ప్రాంతంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆక్రమించుకున్న వారిని వెంటనే ఖాళీ చేయాలని స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆదేశించడంతో తాజాగా వివాదం తెరపైకి వచ్చింది. బీఆర్‌ఎస్ నాయకులు డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇష్టానుసారంగా అమ్ముకున్నారని సాక్షాత్తు ఎమ్మెల్యే ఆరోపించడమేగాక సంబంధిత రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేసి వారిని ఖాళీ చేయించాల్సిందిగా ఆదేశించారు. దీంతో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్పందించి తమ పార్టీ వారు ఎవరికి ఇళ్లను అమ్మలేదని.. ఒకవేళ అమ్మితే నిరూపించాలంటూ సవాల్ విసిరారు. అర్హులకు ఇళ్లను ఇవ్వాలని ఓ వైపు ఎమ్మెల్యే, మరో వైపు మాజీ ఎమ్మెల్యేలు పేర్కొంటున్నా ఖాళీ చేయించిన తర్వాత అవినీతి అక్రమాలు బయటకు వచ్చే అవకాశం ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ఏదేమైనా అధికారులు, పాలకులు స్పందించి అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు దక్కేలా చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఎర్రగుట్టలో ఇళ్ల ఆక్రమణ**

బాదేపల్లి ఎర్రగుట్ట ప్రాంతంలో దాదాపు 560 డబుల్ బెడ్‌రూం ఇళ్లను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పూర్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ వచ్చి ఇళ్లను ప్రారంభించారు. మొక్కుబడిగా ఆరుగురికి పట్టాలను అందజేశారు. తదుపరి అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అర్హులను ఎంపిక చేసేందుకు పట్టణంలో పర్యటించి క్షేత్రస్థాయిలో కసరత్తు చేశారు. కానీ అర్హుల జాబితాను రూపొందించేలోగా ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఇళ్ల కేటాయింపు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. తదుపరి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎవరికి వారు ఇళ్లను ఆక్రమించుకుని నివాసం ఏర్పర్చుకున్నారు.


ఎర్రగుట్టలో ఆక్రమించుకున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు

## 'ఫోన్ ట్యాపింగ్‌పై సిట్‌కు ఫిర్యాదు చేస్తా'

స్టేషన్ మహబూబ్‌నగర్: తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని, దీనిపై సిట్‌కు ఫిర్యాదు చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన దివంగత మాజీ కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డితో ఫోన్‌లో సంభాషిస్తుంటే 2018లో తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని ఆయన ఆరోపించారు. అప్పట్లో అందరి సమక్షంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తనను అవమానపరిచి మానసిక క్షోభకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో అధికార, ప్రతిపక్షాలు ఉండడం సహజమని, గత ప్రభుత్వం అవి మరిచి ఇతరులను ఇబ్బందులు పెట్టడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిందని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ చేసిన వారిని ప్రజలు తిరస్కరించాలని కోరారు. తన ఫోన్ ట్యాపింగ్ విషయంలో ఆధారాలతో సిట్‌కకు ఫిర్యాదు చేస్తానని నర్సింహారెడ్డి తెలిపారు. సమావేశంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, నాయకులు సిరాజ్‌ఖాద్రీ, సీజే బెనహర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి

## ఆలయాల్లో చోరీ

మక్తల్: ఆలయాల్లో విగ్రహాలను, నగదును బుధవారం రాత్రి 3 గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు చోరీ చేసిన సంఘటన మక్తల్ పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలో జంబులమ్మ దేవాలయంలో 5 కేజీల అమ్మవారి ఉత్సవం, 6 వేల నగదు, నగరేశ్వర ఆలయంలో 10 వేలు, డోంగుల ఆంజనేయస్వామి దేవాలయంలో వెండి ఆభరణాలు చోరీ చేసినట్లు స్థానికులు తెలిపారు. ఉదయం ఆలయాలను దర్శించుకునేందుకు వెళ్లిన భక్తులు చెల్లాచెదురైన వస్తువులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. రాత్రి సమయంలో దొంగతనాలు అధికంగా జరుగుతుండంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

## ఇంటి తాళం విరగొట్టి బంగారు, వెండి చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువా తాళం విరగొట్టి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేసిన ఘటన మండలంలోని వనపట్లలో మంగళవారం చోటుచేసుకోగా.. బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ గోవర్దన్ తెలిపిన సమాచారం మేరకు వనపట్లకు చెందిన రేణుక మంగళవారం ఉదయం వ్యవసాయ పొలానికి వెళ్లగా.. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం విరగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 6తులాల బంగారు నగలు, 20తులాల వెండి గొలుసును ఎత్తుకెళ్లారు. సాయత్రం ఇంటికి వచ్చిన రేణుక ఇంటి తాళం విరగొట్టి ఉండటంతో పాటు బీరువాలో బట్టలు, వస్తువులు చిందర వందర ఉండటం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని పరిశీలించి క్లూస్‌టీం వివరాలు సేకరించారు. బుధవారం బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## జూరాలకు స్వల్పంగా తగ్గిన వరద


సుంకేసుల జలాశయం నుంచి దిగువకు పారుతున్న నీరు

- 14 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద బుధవారం స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి 1.28 లక్షల క్యూసెక్కులు ఉండగా.. బుధవారం సాయంత్రానికి 1.22 లక్షలకు చేరిందన్నారు. దీంతో ప్రాజెక్టు 14 క్రస్ట్‌గేట్లను పైకెత్తి 94,878 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు వివరించారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 28,658 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, భీమా లిఫ్ట్–1కు 1,300, ఆవిరి రూపంలో 44, ఎడమ కాల్వకు 770, కుడి కాల్వకు 400, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.933 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

**శ్రీశైలంలో మూడు గేట్లు ఎత్తి..**

దోమలపెంట: శ్రీశైలం ఆనకట్ట మూడు గేట్లను పైకెత్తి 80,646 క్యూసెక్కుల నీటిని బుధవారం దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. 1,81,051 క్యూసెక్కుల నీరు జలాశయానికి చేరుతుండగా.. 882.4 అడుగుల నీటిమట్టం, 201.1205 టీఎంసీల నీటి నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 31,978 క్యూసెక్కుల నీరు అదనంగా సాగర్‌కు వదులుతున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడుకు 19,166 క్యూసెక్కులు, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,266 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.657 మి.యూ., ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 17.478 మి.యూ. విద్యుదుత్పత్తి చేశారు.

**సుంకేసుల జలాశయంలో..**

రాజోళి: సుంకేసుల జలాశయం 15 గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. బుధవారం ఎగువ నుంచి 55 వేల వరద రాగా.. దిగువకు 57,515 క్యూసెక్కులు వదిలినట్లు చెప్పారు. ప్రస్తుతం జలాశయంలో 0.608 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

**కోయిల్‌సాగర్‌లో 23 అడుగులు..**

దేవరకద్ర: కోయిల్‌సాగర్ జలాశయంలో బుధవారం సాయంత్రం 23 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు అధికారులు తెలిపారు. మరో 3.6 అడుగుల నీరు చేరితే పాత అలుగుస్థాయి 26.6 అడుగులకు.. మరో 9.6 అడుగుల నీరు చేరితే పూర్తిగా నిండుతుందన్నారు.

## ఇంటర్ విద్యార్థిపై కత్తితో దాడి



గద్వాల క్రైం: ఇంటర్ విద్యార్థిపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేసిన ఘటన బుధవారం పట్టణంలో కలకలం రేపింది. స్థానికుల కథనం మేరకు.. గద్వాల పట్టణంలోని గంజిపేట కాలనీకి చెందిన రవితేజ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఈ క్రమంలో అంబేడ్కర్ కాలనీకి చెందిన గుర్తు తెలియని యువకులతో కొన్ని రోజులు క్రితం రవితేజకు వివాదం జరిగింది. అయితే పాత కక్షలు మనసులో పెట్టుకొని కొందరు యువకులు బుధవారం పట్టణంలోని కోట సమీపంలో విద్యార్థితో ఘర్షణ పడి ఎడమ వైపు చాతీలో కత్తితో పొడిచారు. పక్కనే ఉన్న చరణ్‌తేజ గొడవను అడ్డుకునేందుకు ప్రయత్నం చేయగా అతడికి సైతం స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రవితేజ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు. ఓ యువతితో ప్రేమ వ్యవహారమే దాడికి గల కారణాలు అయి ఉండొచ్చని స్థానికులు చెబుతున్నారు.

## పుస్తకాలు సమాజానికి దిక్సూచి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పుస్తకాలు సమాజానికి దిక్సూచిగా ఉండాలని పీయూ వీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు పీయూలో ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ రచించిన 'ట్రెన్ ట్రాన్స్‌ఫార్మ్ ట్రాయాంఫ్ అండ్ స్పోర్ట్స్ న్యూట్రీషియన్, వెయిట్ మేనేజ్‌మెంట్' అనే పుస్తకాన్ని ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచం వేగంగా మార్పుచెందుతోందని, మార్పులను వివరంగా పాఠకులకు అందించేందుకు రచయితలు ఎప్పుడు సిద్ధంగా ఉండాలని, వారు పరిశోధన రంగాల్లో మార్గదర్శకులుగా నిలవాలన్నారు. పుస్తకాలు ఒక్క యూనివర్సిటీకే కాకుండా యావత్ సమాజాన్నే ప్రభావితం చేసే విధంగా ఉంటాయన్నారు. ఈ పుస్తకం బీపెడ్, ఎంపెడ్ చేసే విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఆడిట్‌సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రవీణ, ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, రవికాంత్, పీడీ సత్యభాస్కర్, భూమయ్య, అర్జున్‌కుమార్, శ్రీధర్ రెడ్డి, /జ్ఞానేశ్వర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ నేతల ఆరోపణలు అర్థరహితం

**కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి ఎత్తిపోత పథకం (కేఎల్ఐ) కాల్వ పనులపై ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు అర్థ రహితమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన కేఎల్ఐపై చిత్తశుద్ధి ఉండటంతోనే మోటార్లు ప్రారంభించామని చెప్పారు. ప్రజాప్రతినిధిగా ఓడిన తర్వాత టూరిస్టుగా వచ్చిపోతున్న వారికి కేఎల్ఐపై సరైన అవగాహన లేకే ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. డి-63, 64 కాల్వ పనుల్లో కొన్ని మరమ్మతులు ఉన్నాయని.. వాటిని సరిచేస్తూ నియోజకవర్గంలోని మాడ్గుల మండలం నాగిళ్ల వరకు సాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. కల్వకుర్తి అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధిక నిధులు కేటాయిస్తున్నారని వివరించారు.

**11న మంత్రుల పర్యటన..**

నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం రూ.189 కోట్లు కేటాయించిందని.. పట్టణంలో నూతనంగా నిర్మించే 100 పడకల ఆస్పత్రి, వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. అనంతరం పట్టణంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారని వివరించారు. సమావేశంలో నాయకులు ఆనంద్‌కుమార్, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మోతీలాల్, శ్రీనివాస్‌రెడ్డి, రాహుల్, భూపతిరెడ్డి, రాజేష్‌రెడ్డి, నర్సింహ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంకుడుగుంతల నిర్మాణాలతో సత్ఫలితాలు

మహమ్మదాబాద్: కేంద్ర ప్రభుత్వ నిధులతో ఎన్ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంకుడుగుంతల నిర్మాణాలు సత్ఫలితాలిస్తున్నాయని కేంద్ర బృందం సభ్యులు తెలిపారు. బుధవారం మండలంలోని నంచర్ల, గాధిర్యాల్, చౌదర్‌పల్లి, ధర్మాపూర్, మహమ్మదాబాద్‌లో కేంద్ర బృందం జలశక్తి జలభాగ్యధారి అధికారి సైంటిస్టు సందీప్‌కుమార్ ఇంకుడు గుంతల నిర్మాణాలు వాటి వినియోగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గుంతల వినియోగం ఎలా ఉన్నదని, భూగర్భజలాలు పెరిగే అవకాశమున్నదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇంకుడుగుంతల నిర్మాణాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని వినియోగించిన నీరు వృథా కాకుండా తిరిగి భూమిలోకి ఇంకిపోతున్నందున భూగర్భజలాలు పెరిగే అవకాశమున్నదని ఆయా గ్రామాల్లో రైతులు ప్రజలు తెలిపారు. ఎస్ఆర్ఈజీఎస్ కేంద్ర ప్రభుత్వ నిధులు సద్వినియోగమవుతున్నట్టు తెలిపారు. ఈయన వెంట ఈఎన్సీ నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, ఏపీఓ హరిశ్చంద్రుడు, టీఏలు, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.


గాధిర్యాల్‌లో ఇంకుడుగుంతలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం అధికారులు

## మన్యంకొండ హుండీ ఆదాయం రూ.41.65 లక్షలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మన్యంకొండలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి హుండీని బుధవారం లెక్కించారు. మార్చి 22వ తేదీ నుంచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా మొత్తం రూ. 41,65,385 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అళహరి మధుసూదన్‌కుమార్, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ మదనేశ్వర్, ఈఓ శ్రీనివాసరాజు, ఐడీబీఐ బ్యాంకు మేనేజర్ మల్లికార్జునతో పాటు పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.


మన్యంకొండలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు, పాలకమండలి సభ్యులు

## చిన్నారుల వసతులపై జడ్జి ఆరా

పాలమూరు: జిల్లా కేంద్రంలో ఉన్న షెల్టర్ హోం ఫర్ బాయ్స్, చిల్డ్రన్ హోంను బుధవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర సందర్శించారు. స్థానికంగా చిన్నారులకు అందుతున్న సౌకర్యాలు, ఇతర వసతులపై ఆరా తీశారు. అన్ని సదుపాయాలు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏవైనా ఉంటే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని సూచించారు.


చిన్నారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.ఇందిర